ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలిన ప్రజలు

రామాయంపేట/నిజాంపేట/చిన్నశంకరంపేట, నవంబర్ 15: రామాయంపేట పట్టణం నుంచి 'ప్రజా ఆశీర్వాద సభ'కు భారీగా ప్రజలు తరలి వెళ్లారు. బుధవారం పట్టణంలోని కేసీఆర్ కాలనీ నుంచి బైక్ ర్యాలీతో పాటు మహిళలు వందలాదిగా తరలివెళ్లారు. పట్టణం లోని 12 వార్డుల నుంచి సుమా రు 150 వాహనాల్లో చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో వందలాదిగా తరలివెళ్లారు. ఒక్క కేసీఆర్ కాలనీ నుంచి దాదాపు 500 మంది సీఎం సభకు తరలివెళ్లారు. వీరి వెంట రామాయంపేట పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, సరాఫ్ యాదగిరి, బాదె చంద్రం, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, శ్యాంసుందర్, కొండల్‌రెడ్డి, చింతల యాదగిరి, బొర్ర అనిల్, చింతల రాములు, మర్కు దత్తు, శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ను చూసేందుకు..

మెదక్‌లో బుధవారం సీఎం కేసీఆర్ హాజరైన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభకు నిజాంపేట మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను చూసేందుకు వెళ్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు చింతల స్వామి పేర్కొన్నారు.

పట్లోరి రాజు ఆధ్వర్యంలో..

మెదక్‌లో బుధవారం సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పట్లోరి రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. చిన్నశంకరంపేటతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు, యువకులు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

నిజాంపేట: కల్వకుంట నుంచి సీఎం సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నశంకరంపేట: గవ్వలపల్లి గిరిజనతండా నుంచి ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న తండావాసులు

రామాయంపేట: కేసీఆర్ కాలనీ నుంచి సభకు భారీగా తరలివెళ్తున్న మహిళలు

కేసీఆర్ కాలనీ నుంచి బైక్‌ర్యాలీతో సభకు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నశంకరంపేట: సూరారం నుంచి ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నశంకరంపేట: చందాపూర్ నుంచి ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న మహిళలు

రాజ్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎలాక్షన్ రెడ్డి

రాజ్‌పల్లిలో ఇంటింటి ప్రచారం

మెదక్ రూరల్, నవంబర్ 15: మెదక్ మండలంలోని రాజ్‌పల్లిలో బుధవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలాక్షన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో ఎన్నికల అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాసామ్యంలో ఓటు కీలకం

మెదక్ రూరల్, నవంబర్15: ప్రజాసామ్యంలో ఓటు కీలకమని, ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. 100 శాతం ఓటింగ్ లక్ష్యంగా బుధవారం మెదక్ మండల పరిధిలోని పాతూరు గ్రామంలో సంచార ప్రదర్శన వాహనం ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓట్లు వేస్తామని ప్రజలతో ఎంపీడీవో శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో కళాజాతర నిర్వహించారు. ఎన్నికల కమిషన్ గుర్తించిన 13 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తమ వెంట తీసుకుని వెళ్లి పోలింగ్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రశాంత్, సర్పంచ్ లింగమ్మ, నాయకులు బాలయ్య, శ్రీనివాస కళా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థినులు

పుస్తక పఠనంతోనే విషయ పరిజ్ఞానం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 15: పుస్తక పఠనంతోనే విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వాసంతి పిళ్లై అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా పుస్తకాలకు ఉన్న ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. యువత ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు దూరంగా ఉండాలని, సమాజం గురించి తెలుసుకోవాలంటే మంచి పుస్తకాలు చదవాలన్నారు. వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సుస్మిత, అధ్యాపకులు, లైబ్రేరియన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట, నవంబర్15: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పాపన్నపేట మండలంలోని రామతీర్థంలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ గాలయ్య కథనం ప్రకారం.. రామతీర్థం గ్రామానికి చెందిన తాడురి ఎల్లయ్య, కిష్టమ్మలకు ముగ్గురు సంతానం. 12 ఏండ్ల క్రితం ఎల్లయ్య మృతి చెందగా అప్పటి నుంచి కిష్టమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద వాడైనా సుమన్(21) కూలీ పనులు చేసుకుంటూ చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కిష్టమ్మ డ్వాక్రా గ్రూపులో చిట్టి డబ్బులు తీసుకున్నది. దీంతో చిట్టి డబ్బులు ఎందుకు తీసుకున్నావని తల్లి కిష్టమ్మతో సుమన్ గొడవపడ్డాడు. తల్లి భయపడి నార్సింగిలోని తన చెల్లి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో సుమన్ ఇంట్లోని ఓ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన బంధువులు గమనించి కిష్టమ్మకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించి, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నచ్చి బీఆర్ఎస్‌లోకి..

- బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో 50 మంది చేరిక

రామాయంపేట, నవంబర్ 15: అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చే బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట పట్టణానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శి మెట్టు స్వప్న ఆధ్వర్యంలో 50 మంది మహిళా బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ బీఆర్ఎస్ నాయకులు మెడలో గులాబీ కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ డబ్బులకు అమ్ముడుపోయిందని, ఆ పార్టీకి సిద్ధాంతాలు లేకుండా పోయాయని బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ చంద్ర, కౌన్సిలర్లు నాగరాజు, యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు శ్యాంకుమార్, కొండల్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులతో బీఆర్ఎస్ శ్రేణులు

ఓటర్లు ప్రలోభాలకు లొంగకూడదు: ఎఫ్ఎస్‌టీ బృందం

రామాయంపేట, నవంబర్15: ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల సంఘం ఎఫ్ఎస్‌టీ సభ్యుడు కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి పలు సూచనలు సలహాలిచ్చారు. ఎన్నికల్లో ఎవరైనా డబ్బు, మద్యం ఇతర వస్తువుల ఆశ చూపి ఓటును వేసుకోవాలని చూస్తే వెంటనే తమకు 'సీ-విజిల్' యాప్‌లో ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. తమకు ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోనే సదరు క్యాండెట్‌పై చర్యలు తీసుకుంటామన్నామని ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం